క్లుప్తంగా

పెబ్బేరు తహసీల్దార్‌గా అబ్రహం లింకన్



పెబ్బేరు: స్థానిక తహసీల్దార్‌గా అబ్రహం లింకన్‌గా శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ శాంతిలాల్ జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో సెక్షన్ తహసీల్దార్‌గా బదిలీ కావడంతో ఆయన స్థానంలో అబ్రహం లింకన్ వచ్చారు.

శ్రీరంగాపూర్ తహసీల్దార్‌గా మురళి



పెబ్బేరు రూరల్: శ్రీరంగాపూర్ మండల నూతన తహసీల్దార్‌గా మురళి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ అబ్రహం లింకన్ పెబ్బేరుకు బదిలీ కావడంతో ఆయన స్థానంలో మురళి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఎప్పుడు అందుబాటులో ఉంటానని తెలిపారు.

భక్త మార్కండేయ ఆలయ నూతన కమిటీ ఎన్నిక

కొత్తకోట: పట్టణ కేంద్రంలోని చంద్రమౌళీశ్వర భక్త మార్కండేయ దేవస్థాన నూతన కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సాక నర్సింహులు, ప్రధాన కార్యదర్శిగా మహంకాళి సురేష్, గౌరవ అధ్యక్షుడిగా సాక బాలనారాయణ, సంబరి బాలస్వామి, సూర సత్యనారాయణ, జన్ను వెంకటనారాయణ, కోశాధికారిగా సాక బాలరాజు, ప్రచార కార్యదర్శిగా సాక నాగరాజు, కార్యవర్గ సభ్యులుగా సూర నాగరాజు, సంబరి బాలరాజు, గోరంట్ల ప్రభాకర్, సూర వెంకటస్వామి, ఎస్‌బీఐ బాలరాజు, గుర్రం నర్సయ్య, మహంకాళి వెంకటేష్, జన్ను నర్సింహ, ఎంగళి రాజు, పుట్ట సంతోష్, పగడాకుల రాములు, పగడాకుల మద్దిలేటి, శ్రీరాం రామేష్, చిన్ని శంకర్, సాక బాలరాజు ఎన్నుకున్నారు.

పారిశుద్ధ్య నిర్వహణపై అవగాహన



పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని 3, 4వ వార్డులో పారిశుద్ధ్యం నిర్వహణపై శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణశ్రీ, కమిషనర్ ఆదిశేషులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వార్డులో తిరుగుతూ మురుగు కాల్వలు, రహదారులు శుభ్రం చేయడంతో పాటు పలు పారిశుద్ధ్యం కార్యక్రమాలపై ప్రజలకు, సిబ్బందికి వివరించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ కర్రెస్వామి, కౌన్సిలర్లు పార్వతి, సువర్ణ, ఆశ్విని, ఏఈ రమేష్‌నాయుడు, మేనేజర్ గణేష్ బాబు, వార్డు స్పెషల్ అధికారులు గంగన్న, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో ఘనంగా స్కూల్ డే



పెబ్బేరు రూరల్: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ–3లో శనివారం స్కూల్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సర్పంచ్ వినీలా రాణి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లల మేథో అభివృద్ధి అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే పిల్లలు నేర్చుకున్న కథలు, పాటలను తల్లిదండ్రుల ఎదుట ప్రదర్శించారు. కార్యక్రమంలో మహిళా సఘాల అధ్యక్షురాలు అనురాధ, ఆశా వర్కర్ జ్యోతి అంగన్‌వాడీ టీచర్ మంజుల రాణి తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రవేశ పరీక్ష

ఖిల్లాఘనపురం: మండలంలోని దొంతికుంట తండా సమీపంలో ఉన్న తెలంగాణ మోడల్ పాఠశాలలో ప్రవేశం కోసం ఆదివారం పరీక్ష నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ వాణికుమారి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 6వ తరగతి వారికి ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు, 7వ తరగతి నుంచి 10వ తరగతి వారికి మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు.

బిజినేపల్లి: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఆరో తరగతి నుంచి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లకు ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ సుమతి శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఇదే పాఠశాలలో ఉదయం 11 గంటలకు పరీక్ష ప్రారంభమవుతుందని, విద్యార్థులు గంట ముందుగానే పరీక్ష కేంద్రానికి హాజరుకావాలని సూచించారు.

కోడేరు: మండల కేంద్రంలో మాడల్ స్కూల్ ప్రవేశానికి నిర్వహించే పరీక్షకు ఏర్పాట్లు చేసినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఉమయశ్రీ తెలిపారు. ఆరో తరగతికి ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, ఏడో తరగతి నుంచి 10వ తరగతి వరకు మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు పరీక్ష ఉంటుందని చెప్పారు. విద్యార్థులు గంట ముందు పరీక్ష కేంద్రానికి రావాలని సూచించారు.

మట్టి కుండలకు భలే గిరాకీ

- వేసవి ప్రారంభంలోనే జోరందుకున్న కొనుగోళ్లు
- పేదోడి ఫ్రిజ్‌కు మార్కెట్‌లో డిమాండ్



పెబ్బేరులో నల్లా బిగించిన మట్టి కుండలు



కొత్తకోటలో అమ్మకానికి సిద్ధంగా ఉంచిన మట్టి కుండలు

కొత్తకోట రూరల్: రోజు రోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతల నుంచి ఉపశమనం పొందేందుకు పట్టణ ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించారు. దీంతో చల్లని నీటి కోసం మట్టి కుండ (రంజన్‌లు)ను ఆశ్రయిస్తున్నారు. పేదోడి ఫ్రిజ్‌గా పేరొందిన కుండలకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందని వ్యాపారస్తులు తెలిపారు. పట్టణంలో రెండు, చోట్ల కుండల అమ్మక కేంద్రాలు ఉండగా కొనుగోలుదారుల తాకిడి మొదలైంది. దీంతో వేసవి ప్రారంభంలోనే కుండలకు డిమాండ్ పెరిగింది. మట్టితో కుండలను తయారు చేయడం నీరు చల్లగా ఉండటంతోపాటు ఆరోగ్యదాయకం కావడంతో ధనిక, పేద, మధ్యతరగతి ప్రజలు కుండలను కొనుగోలు చేసేందుకు ముందుకు వస్తున్నారు.

అందుబాటు ధరల్లోనే..

కుండలను బట్టి రూ.50 మొదలుకొని రూ.500 వరకు ధరలు ఉన్నాయి. కుండలకు ట్యాప్‌ను సైతం బిగించి ఉండటంతో ప్రజలు వాటిపై ఎక్కువ మొగ్గు చూపుతున్నారు. జడ్చర్ల, నంచర్ల, కోస్గి, కొడంగల్ ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన కుండలకు మంచి డిమాండ్ ఉందని విక్రయదారులు అంటున్నారు. పట్టణాల్లో రిఫ్రిజిరేటర్ల వాడకం ఎక్కువగా ఉన్నప్పటికీ వేసవి దృష్ట్యా మట్టి కుండల్లోని నీరు తాగితే ఆరోగ్యానికి కూడా మేలు జరుగుతుందని వైద్యులు సూచిస్తుండడంతో వాటిపై మక్కువ పెరిగింది.

ఆరోగ్యానికి మేలు



కుండల్లో నిల్వ ఉంచిన నీరు చల్లగా ఉండటంతో పాటు ఆరోగ్యానికి మంచిది. రిఫ్రిజిరేటర్లను వాడుతున్న రోజుల్లో సైతం మట్టికుండలకు మాత్రం ఆదరణ తగ్గలేదు. సహజసిద్ధమైన మట్టితో తయారు చేసిన కుండలను కొనేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. బయట తిరిగి వచ్చి కుండలోని నీరు తాగితే హాయిగా ఉంటుంది.

– నాగరాజుయాదవ్, కొత్తకోట

ఎండాకాలం వచ్చిందంటే..



కుండల నీరు తాగితే ఆరోగ్యానికి మంచిదని డాక్టర్లు చెబుతుంటారు. ఇంట్లో ఫ్రిజ్ ఉన్నా కూడా కొన్నేళ్లుగా వేసవి కాలం వచ్చిందంటే కొత్త కుండను తీసుకొస్తాను. కుండలు కూడా అందుబాటు ధరలో ఉండడంతో పేదలు సైతం అధికంగా వాడుతుంటారు.

– శంకర్‌గౌడ్, హెచ్‌ఎం, జెడ్పీహెచ్ మనిగిల్ల

ధరలు అందుబాటులో ఉన్నాయి



కుండల ధరలు తక్కువగా ఉండటంతో పేద, మధ్య తరగతి ప్రజలు కొనుగోలు చేసేందుకు ముందుకు వస్తున్నారు. మట్టి కుండలకు నల్లా సైతం ఉండటంతో ప్రజలు కొనుగోలు చేసేందుకు ఇష్టపడుతున్నారు. విభిన్న ఆకృతుల్లో కూజాలు, బాటిళ్లు కూడా అందుబాటులో ఉన్నాయి.

– కుమ్మరి నాగమణి, విక్రయదారురాలు

ఓటర్ నమోదుపై దృష్టి సారించండి



అమరచింతలో..



మదనాపురంలో బీఎల్‌ఓలకు అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ నరేందర్

అమరచింత: ఓటర్ నమోదుపై బీఎల్‌ఓలు ప్రత్యేక దృష్టి సారించాలని తహసీల్దార్ సింధూజ అన్నారు. తహసీల్దార్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం బీఎల్‌ఓలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటరు కార్డుకు ఆధార్ కార్డు నంబర్ అనుసంధానం చేయాలన్నారు. ఫారం 6 కొత్త ఓటరు నమోదు, ఫారం 7 తొలగింపుల కోసం, ఫారం 8 మార్పులు చేర్పులు తదితర అంశాలపై బీఎల్‌ఓలకు యాప్‌లో ఎలా నమోదు చేయాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీటీ చాణక్య, ఆర్‌ఐలు జయమ్మ, నర్సింహులు, జూనియర్ అసిస్టెంట్ నాగేంద్ర ప్రసాద్, రఘు పాల్గొన్నారు.

మదనాపురం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం బీఎల్‌ఓలతో తహసీల్దార్ నరేందర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తప్పులు లేని ఓటరు జాబితా తయారు చేయాలని సూచించారు. ఓటరు జాబితాలో ఆధార్ కార్డు వివరాలతో నమోదు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీటీ అశోక్, బీఎల్‌ఓలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి

పాన్‌గల్: మండల బీజేపీ నూతన అధ్యక్షుడిగా బుసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన పుట్ట నాగరాజునాయుడు నియమితులైయ్యాడు. మండల పార్టీ అధ్యక్షుడిగా నియమాక పత్రాన్ని నాగర్‌కర్నూల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు, నియోజకర్గ ఇన్‌చార్జ్ ఎల్లేని సుధాకర్‌రావు చేతుల మీదుగా శనివారం అందుకున్నారు. తనపై ఎంతో నమ్మకం ఉంచి మండల పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించినందుకు ఎల్లేని సుధాకర్‌రావు, వనపర్తి జిల్లా అధ్యక్షుడు రాజవర్ధన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అందరి సహకారంతో పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పాన్‌గల్: మండల కేంద్రంలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని మండల ట్రాన్స్‌కో ఏఈ చందన్‌కుమార్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పలు కాలనీల్లో విద్యుత్ లైనింగ్ పనులు నిర్వహిస్తుండటంతో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు, వ్యాపారులు సహకరించి తోడ్పాటునందించాలని కోరారు.

మహిళను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

వనపర్తి క్రైం: నడుచుకుంటూ వస్తున్న ఓ మహిళను ఆర్టీసీ బస్సు ఢీకొని తీవ్ర గాయాలైన ఘటన శనివారం జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. పట్టణ ఎస్‌ఐ యుగంధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని గాంధీనగర్‌కు చెందిన ఫైజున్‌బీ, అమీరాబీలు పని నిమిత్తం 4వ వార్డు బాలానగర్ కాలనీకి వెళ్లి రోడ్డుపైకి వస్తుండగా.. వనపర్తి నుంచి గోపాల్‌పేట వైపు వెళ్తున్న నాగర్‌కర్నూల్ ఆర్టీసీ బస్సు ఫైజున్‌బీను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆమె తల, చేయికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించినట్లు వెల్లడించారు. బాధితురాలి అల్లుడు లాలుమియా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు పాలిటెక్నిక్ పరీక్ష రాసేందుకు వైడీఐఆర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్‌ను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ సంస్థ జిల్లా కోఆర్డినేటర్ రామకృష్ణ మాట్లాడారు. ఈ సంస్థ ద్వార పేద విద్యార్థులు చదువుకునేందుకు అవసరమయ్యే పుస్తకాలు అందజేస్తామన్నారు. శ్రీను, శేఖర్, రామస్వామి, మల్లేష్, శివ పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి: ఎమ్మెల్యే ఆల



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి

భూత్పూర్: కుల, మత, జాతి బేదం లేకుండా అన్ని వర్గాల అభ్యున్నతికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని కేఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో రంజాన్ సందర్భంగా పేద ముస్లింలకు రంజాన్ తోఫా, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులతో పాటు దళితబంధు పథకం లబ్ధిదారులకు వాహనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం కేసీఆర్ అభివృద్ధిలో తెలంగాణను అగ్రగామిగా నిలిపారని పేర్కొన్నారు. నియోజవర్గంలో 65వేల మంది రైతులకు గాను రూ.900కోట్లు రైతుబంధు కింద ఇచ్చినట్లు తెలిపారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ తదితర అభివృద్ధి ఫలాలను ప్రజలకు అందిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్ గౌడ్, ఎంపీపీ కదిరె శేఖర్ రెడ్డి, వైస్ ఎంపీపీ నరేష్ గౌడ్, నాయకులు నారాయణ గౌడ్, మత్స్య సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణ, నర్సింహులు గౌడ్, తహసీల్దార్ చెన్న కిష్టన్న, కమిషనర్ నజీబ్, ఎంపీడీఓ మున్నీ పాల్గొన్నారు.

ఎంపీడీఓకు సమ్మె నోటీస్ అందజేత



పాన్‌గల్ ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు

పాన్‌గల్: ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం నాలుగేళ్ల ప్రొహిబీషన్ కాలం పూర్తి చేసుకున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేసేందుకు ఉత్తర్వులు జారీ చేయకపోవడాన్ని నిరసిస్తూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డికి సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేయడంతో పాటు నాలుగేళ్ల కాలాన్ని సర్వీస్ కాలంగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా గుర్తిస్తూ వారిని రెగ్యులర్ చేయాలన్నారు. మరణించిన జూనియర్ పంచాయతీ కార్యదర్శుల కుటుంబాలకు కారుణ్య నియమాకాలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అర్హులైన కార్యదర్శులకు పదోన్నతులు కల్పించాలని, 317 జీఓ ప్రకారం నష్టపోయిన కార్యదర్శులకు న్యాయం చేయాలని, పరస్పర బదిలీలకు అవకాశం కల్పించాలని కోరారు. ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వకపోవడంపై ఈనెల 28వ తేదీ నుంచి నిరవదిక సమ్మె చేయనున్నట్లు వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ రఘురాములు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అమరచింత: గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేయాలని జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సంఘం ఆత్మకూర్ మండల అధ్యక్షుడు మురళి డిమాండ్ చేశారు. ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం జూనియర్ పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ పార్వతమ్మకు అందించారు. కార్యక్రమంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు నాగరాజ్, యశోద, మనోహర్‌గౌడ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



ఖిల్లాఘనపురంలో..



ఆత్మకూర్ ఎంపీడీఓ కార్యాలయంలో..

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలో ఎంపీడీఓ విజయ్‌కుమార్, ఎంపీఓ రాజుకు శనివారం జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సమ్మె నోటీస్ ఇచ్చారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీల సంఖ్య పెంచాలి



జంగమాయపల్లి శివారులో పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ అఫ్జల్

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని వివిధ గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులు వేగవంతం చేసేందుకు కూలీల సంఖ్య పెంచాలని పంచాయతీ కార్యదర్శులకు, ఫీల్డ్ అసిస్టెంట్లకు ఎంపీడీఓ అఫ్జల్ సూచించారు. శనివారం మండలంలోని పామిరెడ్డిపల్లి, జంగమాయపల్లి, బలిజపల్లి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీల వివరాలను మస్టర్లలో ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలన్నారు. పనులు జరిగే ప్రదేశంలో కూలీలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూసుకోవడంతో పాటు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను కూలీలకు ఇవ్వాలన్నారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఉదయం 7గంటల నుంచి 12గంటల వరకు పనులు ముగించాలని సూచించారు.

రంజాన్ కానుకల పంపిణీపై సమావేశం



ముస్లిం మత పెద్దలతో సమావేశమైన తహసీల్దార్ సింధూజ

అమరచింత: రంజాన్ పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న రంజాన్ తోఫాలను వితరణ చేయడానికి అర్హులైన పేద ముస్లింల జాబితాను అందించాలని తహసీల్దార్ సింధూజ అన్నారు. శనివారం ఆత్మకూర్ తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని ముస్లిం మత పెద్దలతో సమావేశం నిర్వహించారు. ప్రతి ఏడాది మాదిరిగానే ప్రభుత్వం ఈసారి మండలానికి 200 రంజాన్ తోఫాలను సరఫరా చేసిందన్నారు. పట్టణంతో పాటు ఆయా గ్రామాల్లో ముస్లిం జనాభా ప్రకారం అత్యంత నిరుపేద ముస్లింల కుటుంబాలను గుర్తించి వాటి వివరాలను అందించాలని కోరారు. త్వరలోనే ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి చేతుల మీదుగా రంజాన్ కానుకలను అందిస్తున్నట్లు తెలిపారు.

సీసీ రహదారి నిర్మాణంలో నాణ్యత లోపించొద్దు



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ గాయత్రి

అమరచింత: ఆత్మకూర్ పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న సీసీ రహదారి నిర్మాణంలో నాణ్యత లోపించకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి అన్నారు. పట్టణంలో శనివారం పలు వార్డుల్లో పర్యటించి సీసీ రహదారులు, డివైడర్ పనులతో పాటు పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈమేరకు చైర్‌పర్సన్ మాట్లాడుతూ పట్టణంలో మున్సిపాలిటీ నిధుల ద్వారా సీసీ రహదారుల నిర్మాణాలను చేపడుతున్నామని వెల్లడించారు. వేసవిలో దోమలు పెరిగి ప్రజలు రోగాల బారిన పడకుండా పారిశుద్ధ్య కార్మికులతో డ్రెయినేజీలను శుభ్రపరుస్తున్నామన్నారు. ప్రజలు తమ ఇంట్లోని వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ పారవేయకుండా మున్సిపాలిటీల చెత్త ఆటోల్లో వీటిని వేయాలని సూచించారు. రోడ్డు డివైడర్ పనులు త్వరితంగా చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ విజయభాస్కర్, కమిషనర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాల్లో నివేదిత కళాశాల విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

కొత్తకోట: పట్టణ కేంద్రంలోని నివేదిత డిగ్రీ కళాశాల విద్యార్థులు 2022–23 విద్యా సంవత్సరంలో 1, 3, 5 సెమిస్టర్లలో ఉత్తమ ఫలితాలు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ పికిలి సహదేవుడు తెలిపారు. ఎస్‌జీపీఏ 10 పాయింట్లకు గాను ఎంపీసీఎస్–1లో ముస్కాన్ 9.84, బీజెడ్సీలో–3లో భవాని 9.44, బీజెడ్సీ–5లో అర్షియా 9.40, బీకాం–3లో షాసన 9.36 పాయింట్లు, ఎంపీసీఎస్–5లో అంజూమ్ 9.36, బీజెడ్సీ–3లో అయేషా 9.26, ఎంపీసీఎస్–5లో స్వాతి 9.20, బీజెడ్సీ–5లో శ్రావణి 9.20, ఎంపీసీఎస్–1లో భావన 9.16, బీజెడ్సీ–1లో సైమా 9.12, ఎంపీసీఎస్–3లో నిహారిక 9.12, బీఏ–3లో ధరణి 9.12, బీఏ–5లో మానిక 9.08, ఎంపీసీఎస్–5లో పల్లవి 9.08, బీజెడ్సీ–3లో సింధు 9.04, బీజెడ్సీ–5లో మానిక 9.04, ఎంపీసీఎస్–3లో అనురాధ 9, బీజెడ్సీ–3లో జ్యోస్న 9 పాయింట్లు సాధించారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు విద్యార్థులు అభినందించారు.

యాపట్లలో చలివేంద్రం ప్రారంభం



పెద్దకొత్తపల్లి: యాపట్లలో ఆటో డ్రైవర్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం ఉపసర్పంచ్ అజయ్, ఆటో యూనియన్ కార్యదర్శి చంద్రశేఖర్ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని ప్రయాణికుల దాహం తీర్చడానికి చలివేంద్రం ఉపయోగించుకోవాలని కోరారు. జహంగీర్, రాముడు, రమేష్, సత్యం, మహేష్, శివ, శ్రీను, వెంకటస్వామి పాల్గొన్నారు.

నేడు కొల్లాపూర్‌లో ఇఫ్తార్

కొల్లాపూర్: పట్టణంలోని మహబూబ్ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం సాయంత్రం ముస్లింలకు ప్రభుత్వం తరపున ఇఫ్తార్ ఏర్పాటు చేయనున్నట్లు జామెమసీద్ కమిటీ నాయకులు అమీన్‌పాషా, రుక్మద్దీన్ వెల్లడించారు. అధికారికంగా ఏర్పాటు చేసే కార్యక్రమానికి ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి, ప్రభుత్వ అధికారులు హాజరవుతారని చెప్పారు. ఉపవాస దీక్షలు చేస్తున్న ముస్లింలు ఇఫ్తార్‌కు హాజరుకావాలని పిలుపునిచ్చారు.

మండలంగా ప్రకటించండి

కోయిల్‌కొండ: గార్లపహాడ్‌ను మండలంగా ప్రకటించే వరకు రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తామని మండల జేఏసీ కోకన్వీనర్ వెంకట్రామిరెడ్డి అన్నారు. శనివారం మండలంలో గార్లపహాడ్ గేటు వద్ద 84వ రోజు రిలేదీక్షలు కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12గ్రామాల ప్రజలు గార్లపహాడ్‌ను మండలంగా ప్రకటించాలని కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే స్పందించి గార్లపహాడ్‌ను మండలంగా ప్రకటించాలని కోరారు.

20న మండల సర్వసభ్య సమావేశం

కొల్లాపూర్: స్థానిక మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 20న నిర్వహించనున్నట్లు ఎంపీపీ బోజ్యా నాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో పాటు, ప్రభుత్వ శాఖల అధికారులు విధిగా హాజరుకావాలని కోరారు. సమావేశానికి హాజరు కాని అధికారులపై శాఖా పరమైన చర్యలకు తీసుకుంటామన్నారు.